క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్లకొమ్మల తొలగింపు కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ భగత్‌సింగ్‌నగర్, సాయినగర్, ఇందిరానగర్, మన్సూరాబాద్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 11కేవీ స్టేడియం, శ్రీనివాసకాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 3 నుంచి మధ్యాహ్నం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, ఆయా కాలనీల ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పహాడీషరీఫ్: వాదే ముస్తఫా విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా పలు కాలనీల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పహాడీషరీఫ్ ఏఈ ఎల్.వీ.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. వాదే ముస్తఫా, వాదే హదీస్, ముస్తఫా హిల్స్, అహ్మద్ అశ్రఫ్ కాలనీల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు. మదీనా కాలనీ, మునీర్‌మజీద్, క్యూబాకాలనీ, మదర్సాలలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని గమనించి ప్రజలు సహకరించాలని కోరారు.

ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే సబితారెడ్డి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

తుక్కుగూడ: రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సబితారెడ్డి తెలిపారు. మంగళవారం ఆమె ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పాడిపంటలతో నియోజకవర్గ ప్రజలను సుఖసంతోషాలతో చూడాలి తల్లి అని వేడుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, బీఆర్‌ఎస్ తుక్కుగూడ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్, కౌన్సిలర్ సుమన్, నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయంతో ఆలయ అభివృద్ధి పనులు



శిలాఫలకం ఆవిష్కరణలో పాలకమండలి సభ్యులు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని బాలాజీ దేవాలయంలో ఉత్తర, పడమర ద్వారం పనులు పూర్తి కావడాన్ని పురస్కరించుకొని ఆలయ పాలక మండలి సభ్యులు మంగళవారం శిలాఫలకాన్ని ఆవిష్కరించి పూజలు నిర్వహించారు. పడమరవైపు సాలహారమును దాత దామోదర్ సచిన్ సోని, ఉత్తరం వైపు సాల హారమును ఎడ్ల కృష్ణారెడ్డి, ఎడ్ల రఘువీర్‌రెడ్డి, ఎడ్ల వాసుదేవారెడ్డిలు, ఉత్తర ద్వారం తలుపును బద్దం జితేందర్‌రెడ్డి నిర్మించినందుకు ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల వెంకటేశ్ వాల్మీకి, సభ్యులు ఇసంపల్లి పద్మశంకర్‌గౌడ్, పెండ్యాల కృష్ణనాయి, సద్ది సహదేవ్, గోండ్యాల అశోక్‌ముదిరాజ్, అర్చకుడు సుధీర్‌కుమార్‌లు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

కందుకూరు: దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. తెలుగుజాతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు సత్తయ్య, రవీందర్‌గౌడ్, బాల్‌రాజ్, పెద్దరామయ్య, భిక్షపతిగౌడ్, చంటిగౌడ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 23, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 18, క్యారెట్ 35. దొండ 23, ఆలు 31, ఉల్లి 24, గోకర 40, దోస 23, సొర 11, పొట్ల 15, అరటి 9, చిక్కుడు 75, అర్వి 40, మునగ 45, చిలగడదుంప 75, బీట్‌రూట్ 21, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 135, కాప్సికమ్ 45. ఈ ధరలు బుధవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

పిల్లివాగు కబ్జా

- కందుకూరులో యథేచ్ఛగా వాగులు, వంకల ఆక్రమణ
- ముంపునకు గురవుతున్న కాలనీలు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



మట్టితో పూడ్చివేసిన పిల్లివాగు

కందుకూరు: నగర శివారు ప్రాంతాల్లోని భూముల విలువ పెరగడంతో వాగులు, వంకలు సైతం కబ్జాకు గురవుతున్నాయి. దీంతో భారీ వర్షాలు పడినప్పుడు వరదనీరు పోయే వీలులేక కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. కందుకూరు మండల పరిధిలోని పలు వాగులు కబ్జాకు గురవుతున్నా సంబంధిత అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి అతి సమీపంలో ఉన్న పిల్లి వాగును ఇటీవల పక్క భూమి యజమాని సగం మేర మట్టితో పూడ్చి విస్తీర్ణాన్ని తగ్గించే ప్రయత్నం చేశాడు. దీంతో కొత్తగూడ, కొత్తగూడ చౌరస్తా, కందుకూరు చౌరస్తా, నేదునూరు గేట్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు పోయే మార్గం లేకుండా పోయింది. ప్రస్తుతం కందుకూరు టౌన్ విస్తరిస్తుండటంతో మున్ముందు ఇలాంటి వాగులు పూడ్చటంతో కొత్త తలనొప్పులు వచ్చే ప్రమాదం ఉంది. భవిష్యత్‌లో కొత్తగూడ చౌరస్తా, కందుకూరు చౌరస్తా నుంచి వచ్చే వర్షపు నీరు, మురుగు పోయే మార్గం కేవలం పిల్లివాగు ద్వారానే ఉంది. అది కాస్తా కబ్జాకు గురవుతుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సదరు రైతు వాగు ముందు భాగంలో మట్టితో సగం మేర పూడ్చగా, వెనక భాగంలో ఓ ప్రైవేట్ వెంచర్ నిర్వాహకులు వాగు స్థానంలో పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఇప్పుడు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

తగ్గిన వాగు విస్తీర్ణం..

వాస్తవానికి పిల్లివాగు ఒక్కో దగ్గర 7 మీటర్ల నుంచి 8 మీటర్లు, కొన్ని ప్రాంతాల్లో 9.5 మీటర్ల విస్తీర్ణంలో ఉంది. కాగా ప్రస్తుతం శ్రీశైలం రహదారి వైపు ఉన్న కల్వర్టు వరకు పక్క భూమి యజమాని సగం మేర వాగు విస్తీర్ణాన్ని తగ్గించేశాడు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వాగులు, చెరువులు, కుంటలు కబ్జాకు గురి కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

> **నోటీసులు ఇచ్చాం**
>
> పిల్లి వాగును కుదిస్తూ వాగులో మట్టి పోసినట్లు మాకు సమాచారం రావడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించాం. వారం రోజుల్లో యథావిధిగా ఉంచాలని భూ యజమానికి నోటీసులు కూడా ఇచ్చాం. స్పందించకపోతే మేమే వచ్చి మట్టి తీయించడంతో పాటు చర్యలు తీసుకుంటాం.
>
> – హబీబుద్దీన్, ఇరిగేషన్ ఏఈ, కందుకూరు

ఆధార్ కేంద్రాల వద్ద అవస్థలు

- గంటల తరబడి ప్రజలకు తప్పని నిరీక్షణ
- పట్టించుకోని అధికారులు



చేవెళ్ల పోస్ట్ ఆఫీస్ వద్ద ఆధార్ అప్‌డేట్ కోసం క్యూలో నిలబడిన ప్రజలు

చేవెళ్ల: ప్రతీ ఒక్కరికి ఇప్పుడు ఆధార్ కార్డు లేనిది ఏ పని జరగడం లేదు. ఈ కార్డు విలువ అంతగా పెరిగింది కానీ ఈ ఆధార్ కేంద్రాలు మాత్రం పెరగటం లేదు. ఉన్నవి తొలగించి నియోజకవర్గంలో ఒకటి, రెండు చోట్లు ఏర్పాటు చేయటంతో అందుబాటులో సరైనా కేంద్రాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలో పోస్టాఫీస్ వద్ద ఉన్న ఒకే ఒక్క ఆధార్ కేంద్రం వద్ద మంగళవారం ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి క్యూలైన్‌లో నిలబడ్డారు. నియోజకవర్గానికి ఈ కేంద్రం ఒక్కటే ఆధారం. ఇక్కడ ప్రతీ రోజు ఆధార్‌కార్డుల కోసం వచ్చే జనం ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్‌లో వేచి ఉండాల్సి వస్తోంది. ఇక్కడ ఒక వ్యక్తి ఒక కంప్యూటర్‌తో రోజుకు 20–30కి మించిన కార్డులకు చేయటానికి రాదు. వృద్ధులు, చిన్నపిల్లలు అందరూ ఉదయం నుంచి సాయంత్రం వరకు కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఈ కేంద్రానికి ఇతర మండలాలు, గ్రామాల నుంచి ఆధార్‌కార్డులలో మార్పులు, చేర్పులు, ఫోన్ నెంబర్ లింక్ చేయటం, వేలిముద్రలు సరిపోకపోవటంతో మళ్లీ అప్‌డేట్ చేసుకునేందుకు, కొత్తగా పిల్లలకు ఆధార్‌కార్డులు తీసుకునేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఉదయం వస్తే సాయంత్రం వరకు క్యూలైన్‌లోనే ఉంటున్నారు. ఇక్కడ పోస్టాఫీస్ కార్యక్రమాలకు వచ్చే జనం, ఆధార్‌కోసం వచ్చే జనంతో చాలీచాలని గదుల్లో ప్రజలు నిలబడేందుకు కూడా స్థలం ఉండటం లేదు. దీంతో రోడ్డుపైకి కనిపించేలా క్యూలైన్‌లోలో నిలబడుతున్నారు. గతంలో మీసేవ కేంద్రాల్లో నిరంతరం అందుబాటులో ఉండేవి. వాటి నుంచి తొలగించిన నాటి నుంచి ఆధార్ కేంద్రాలకు ఇబ్బందులు తప్పటం లేదు. ప్రజల అవసరాల మేరకు ప్రభుత్వం ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. మండల కేంద్రానికి ఒక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేస్తేనే ప్రజలకు అందుబాటులో ఉంటుందని దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

ఎమ్మార్వోకి ఫిర్యాదు చేసిన యువకుడు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బాబునాయక్

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండలం మోకిల తండాలో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతోందని బాబునాయక్ అనే యువకుడు మంగళవారం శంకర్‌పల్లి ఎమ్మార్వో సురేందర్‌కు ఫిర్యాదు చేశాడు. మోకిల తండాలోని సర్వే నం.76లో 29గుంటల ప్రభుత్వ భూమి ఉంది. దాంట్లో ప్రస్తుతం గ్రామ పంచాయతీ భవనం ఉండగా.. భవనం వెనకాల ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇల్లు కట్టడంతో పాటు, బోర్ వేస్తున్నాడు. యువకులు గమనించి గ్రామ సెక్రటరీకి ఫిర్యాదు చేయగా పట్టించుకోలేదు. దీంతో డయల్ 100కి కాల్ చేయగా.. వారు వచ్చి బోర్‌వేల్ యంత్రాన్ని పంపించేశారు. అనంతరం బాబునాయక్ అనే యువకుడు అక్రమ నిర్మాణం చేస్తున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు.

కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత ఇంటర్ విద్య

ఎంఈఓ సయ్యద్ అక్బర్

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ప్రభుత్వం ఇంటర్మీడియేట్‌లో ఉచిత కార్పొరేట్ విద్యను అందించే అవకాశం కల్పిస్తోందని ఎంఈఓ సయ్యద్ అక్బర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈ ఉచిత కార్పొరేట్ విద్యకు ఈనెల 30వ తేదీవరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసిన కనీసం 7 జీపీఏ సాధించిన విద్యార్థులు ఇంటర్‌లో కార్పొరేట్ విద్యను ఉచితంగా పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. విద్యార్థుల దరఖాస్తులను పరిశీలించి మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఇంటర్మీడియేట్‌లో ఎంపిక చేసిన మూడు కళాశాలలో సీట్లు కేటాయిస్తారన్నారు. ఈ విద్యార్థులకు సంబంధించిన ఫీజులను ప్రభుత్వమే ఆయా కళాశాలల యాజమాన్యాలకు చెల్లిస్తోందని చెప్పారు. విద్యార్థులు మీసేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు సమయంలో ప్రాధాన్యత క్రమంలో విద్యార్థులు మూడు కళాశాలలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందన్నారు. జూన్ 3న ఎంపిక జాబితా ప్రకటిస్తారు. 6 నుంచి సర్టిఫికెట్లు పరిశీలన ఉంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాల వివరాలతో కూడిన సమాచారం ఇస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ దివ్యాంగులు, మైనార్టీ, ఈబీసీ, వర్గాలకు చెందిన వారై ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలైన జెడ్పీహెచ్ఎస్, ఎయిడెడ్, కేజీబీవీ, నవోదయ, గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద చదివిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయ పత్రం, కుల ధ్రువీకరణ పత్రాలను, దివ్యాంగులు సదరం సర్టిఫికెట్‌లను జతచేయాలి. వీటితోపాటు బ్యాంక్ పాస్‌బుక్, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివినట్లుగా కనీసం మూడేళ్ల బోనోఫైడ్‌లను దరఖాస్తుతో పాటు జతచేయాలని సూచించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను మంగళవారం మండల వ్యవసాయాధికారి అరుణకుమారి తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో ఉన్న విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల స్టాక్‌ను పరిశీలించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసేవాటికి బిల్లులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా షాపుల యజమానులు సామల రవి, వెంకటయ్య, నర్సింహారెడ్డి, సురేందర్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

లెసెన్స్ పొందిన డీలర్ల వద్దే విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి కోరారు. ఆమనగల్లు మండల పరిధిలోని మంగళపల్లి, చింతపల్లి, విఠాయిపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. విత్తన ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేసవి దుక్కుల వల్ల కలిగే ప్రయోజనాలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈఓలు రాణి, మీనాక్షి, రైతులు.. జంగయ్య, కొండల్‌రెడ్డి, మాధవరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ మండలంలో..

కడ్తాల్: ఫర్టిలైజర్ దుకాణాల నుంచి విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీలత అన్నారు. మండల పరిధిలోని మద్దెలకుంట తండా, ఎక్వాయిపల్లి, గోవిందాయిపల్లి జీపీల్లో వానాకాలం -2024 సీజన్‌కు సంబంధించి విత్తనాల కొనుగోలుపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లూజుగా ఉన్న సంచుల్లో విత్తనాలు కొనుగోలు చేయరాదని, విత్తన ప్యాకెట్, రసీదు బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని.. ప్రతి విత్తన ప్యాకెట్ మీద విత్తనం తయారైన తేదీ, ఎక్స్‌పైరీ తేదీ చూసుకోవలని సూచించారు. విస్తరణ అధికారులు వందన, కేదార్‌సింగ్, రైతులు పాల్గొన్నారు.

మాడ్గుల మండలంలో..

మాడ్గుల: మండల పరిధిలోని రామదుగ్యాల, గిరికొత్తపల్లి, కోల్కులపల్లి, గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ విస్తారణ అధికారుల ఆధ్వర్యంలో రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ వున్న డీలర్ల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ జోష్న, వాహిని, రాధమ్మ, రాజేష్ నాయక్, నవ్య తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: మంగళపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

స్వర్ణోత్సవాలకు అమీర్‌పేట్ పాఠశాల సిద్ధం

నేటి నుంచి రెండురోజుల పాటు వేడుకలు

- హాజరుకానున్న త్రిదండి చినజీయర్ స్వామి, ప్రముఖ పారిశ్రామికవేత్త సీబీఆర్ ప్రసాద్‌రావు



అమీర్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

మహేశ్వరం: చదువు మనిషి జీవన గమనాన్ని మారుస్తుంది. విజ్ఞానపు వెలుగులను పంచుతుంది. అటువంటి అక్షరజ్ఞానమే అన్నింటికి మార్గం. ఈ నానుడిని నిజం చేశారు ఆ ఊరి ప్రజలు, ఆ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు. చదువుతో కలిగే ప్రయోజనాలను ముందే పసిగట్టి అక్షర సేద్యం చేసి చదువులమ్మ ఒడికి పునాది వేశారు. తోచినంత సాయాన్ని విరాళాల రూపంలో సమకూర్చి ఉన్నత పాఠశాల నిర్మాణం, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి ఉన్నత పాఠశాల అప్‌గ్రేట్ చేయించారు. ఆ విద్యామందిరమే వేలాది మందికి విద్యాబుద్ధులు నేర్పించింది. మహేశ్వరం మండలంలోని అమీర్‌పేట్ గ్రామంలో 1956లో ప్రాథమిక పాఠశాలను అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పాఠశాలకు మహేశ్వరం మండలంతో పాటు చుట్టూ ఉన్న గ్రామాలకు చెందిన విద్యార్థులు 1 నుండి 5వ తరగతిలో విద్యను అభ్యసించేవారు. 5వ తరగతి పూర్తయిన తర్వాత పైచదువుల కోసం ఉన్నత పాఠశాల లేకపోవడంతో కొందరైతే పట్టణాలకు వెళ్లి చదివేవారు, మరికొందరు 5వ తరగతి వరకు చదివి ఆగిపోయేవారు. 1956లో బదిలీపై అమీర్‌పేట్ ప్రాథమిక పాఠశాలకు వచ్చిన నారాయణ ప్రత్యేక చొరవ తీసుకొని చుట్టూ ఉన్న గ్రామాలకు చెందిన పెద్దలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేయించి ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ కావడానికి డబ్బులు అవసరం ఉండడంతో డ్రామా మాస్టర్‌ను తీసుకొచ్చి శ్రీకృష్ణా రాయబారం, రామాంజనేయ యుద్ధం నాటకాలు ప్రదర్శించి దాని నుంచి వచ్చి డబ్బులతో పాటు గ్రామస్తుల నుంచి చందాల రూపకంగా సేకరించి ఆ డబ్బులతో పైతరగతుల అనుమతి కొరకు విద్యాశాఖ కార్యాలయంలో రూ.53వేల గ్రాంటులను జమ చేశారు. ప్రభుత్వం 1970లో 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు అనుమతి ఇచ్చింది. 1974 నుంచి 10వ తరగతి ప్రారంభమై 2024 వరకు 50 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా అమీర్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన పూర్వ ఉపాధ్యాయులు, చదివిన పూర్వ విద్యార్థులందరూ కలిసి ఒక కమిటీగా ఏర్పడి స్వర్ణోత్సవ సంబురాలు రెండురోజుల పాటు చేస్తున్నారు. 29వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు చినజీయర్‌స్వామి చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన, ఉపన్యాసం, స్వామివారి ఆశీర్వచనము ఉంటుంది. అనంతరం పూర్వవిద్యార్థులతో క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాలు, యక్షగానం(మాయసుభద్ర విలాసం) నాటికలు నిర్వహిస్తారు. 30వ తేదీన గురువారం పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థుల ఉపన్యాసాలు, అనుభవాలు చెప్పుకుంటారు. పారిశ్రామికవేత్త సీబీఆర్ ప్రసాద్‌రావు సందేశం, రాత్రి 8 గంటలకు పూర్వ విద్యార్థులతో శ్రీకృష్ణ రాయబారం పౌరాణిక నాటకం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి పాఠశాలలో చదువుకున్న వందలాది మంది పూర్వవిద్యార్థులు, విద్యను అభ్యసించిన పూర్వ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరవుతున్నారని స్వర్ణోత్సవ కమిటీ అధ్యక్షుడు కేజే.శివరాజ్, కోశాధికారి ఎం.సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.వెంకటేశ్వర్‌రెడ్డిలు పేర్కొన్నారు.

బస్సు సౌకర్యంపై గ్రామస్తుల హర్షం

కేశంపేట: మండల పరిధిలోని నిర్ధవెల్లి గ్రామానికి ఐఎస్ సదన్ నుంచి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామం నుంచి కడ్తాల్, రావిచేడ్, మక్తామాదరం గ్రామాల నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు ఈ బస్సు సౌకర్యవంతంగా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించిన మహేశ్వరం డిపో మెనేజర్ మోహన్‌రెడ్డి, సీఐ అంజమ్మలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి నూతనంగా వచ్చిన ఆర్టీసీ బస్సుకు గ్రామస్తులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మల్లయ్య, శ్రీను, జీవనమూర్తి, ఆశోక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వెంకట్‌గోపాల్‌శాస్త్రికి డాక్టరేట్

మొయినాబాద్‌రూరల్: యూనివర్సిటీలలో నిర్వహించే పరిశోధనలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కిష్టఫర్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూ పరిధిలో గల చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ లో వెంకటగోపాల్‌శాస్త్రికి డాక్టరేట్ లభించింది. వెంకటగోపాల్ శాస్త్రీ వాణిజ్యం, వ్యాపార నివారణ విభాగంలో ఫిజికల్ అండ్ ఫైనాన్షియల్ ఫర్ఫామెన్స్ ఆఫ్ ఎస్‌బీఐ ఏ సెలక్ట్ స్టడీ అనే అంశంపై డాక్టర్ వెంకట జనార్ధన్‌రావు పర్యవేక్షణలో వెంకటగోపాల్‌శాస్త్రీ పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఆయనకు డాక్టరేట్ లభించగా మంగళవారం వైస్ ఛాన్సలర్ కిష్టఫర్ అభినందించి డాక్టరేట్ పట్టాను అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేట్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డి, రిజిస్ట్రార్ రవీందర్, జగదీశ్వర్, ప్రతాప్, రాజేందర్, రాజు, పబ్లిక్ రిలేషన్ అధి కారి రాంబాబు పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

మొయినాబాద్: ప్రభుత్వం 60శాతం సబ్సిడీపై అందజేసే పచ్చిరొట్ట పైర్లకు సంబంధించిన విత్తనాలు(జనుములు) అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి రాగమ్మ తెలిపారు. మొయినాబాద్‌లోని పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ)లో 90 క్వింటాళ్ల జనుములు అందుబాటులో ఉన్నాయని బుధవారం రైతులకు అందజేస్తామని తెలిపారు. 40 కిలోల బస్తాకు సబ్సిడీ పోను రూ.1448 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జనుములు కావాల్సిన రైతులు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్ కాపీలు తీసుకుని వచ్చి మొయినాబాద్, కేతిరెడ్డిపల్లి క్లస్టర్‌లలోని రైతువేదికల వద్ద వ్యవసాయాధికారుల నుంచి పర్మిట్‌లు తీసుకొని జనుములు తీసుకోవాలన్నారు. మండలంలోని చిలుకూరు, హిమాయత్‌నగర్, దేవల్‌వెంకటాపూర్, నాగిరెడ్డిగూడ, బాకారం, ఎనికేపల్లి, అమ్డాపూర్, నజీబ్‌నగర్, ముర్తూజగూడ, మేడిపల్లి, చిన్నమంగళారం, మోత్కుపల్లి, రెడ్డిపల్లి, చందానగర్, అజీజ్‌నగర్, బంగాలిగూడ గ్రామాల రైతులు మొయినాబాద్ క్లస్టర్ రైతువేదికలో, నక్కలపల్లి, ఎత్‌బార్‌పల్లి, తోలుకట్ట, చాకలిగూడ, కేతిరెడ్డిపల్లి, సజ్జన్‌పల్లి, కనకమామిడి, పెద్దమంగళారం, చిన్నషాపూర్, వెంకటాపూర్, శ్రీరాంనగర్, సురంగల్ గ్రామాల రైతులు కేతిరెడ్డిపల్లి క్లస్టర్ రైతువేదికలో పర్మిట్లు తీసుకోవాలన్నారు.

హరిహర క్షేత్రంలో ఎమ్మెల్యే పూజలు



భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: యాచారం మండలం చౌదర్‌పల్లిలోని శ్రీ హరిహర దివ్య క్షేత్రంలో మంగళవారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో గతేడాది గ్రామస్తులు శ్రీ హరిహర దివ్య క్షేత్రాన్ని నిర్మించారు. ఈ క్రమంలో రెండు రోజులుగా దివ్యక్షేత్రం ప్రథమ వార్షికోత్సవం ఘనంగా జరుగుతోంది. అందులో భాగంగా ఎమ్మెల్యే పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తిభావంతో ప్రశాంతత, సంతోషం నెలకొంటుందని అన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, చిలుక మధుసూదన్‌రెడ్డి, అమృతాసాగర్, అరవింద్‌నాయక్, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.